# శుభవాస్తు

**వాస్తుశాస్త్ర సేవా కార్యక్రమ వెబ్‌సైట్**

www.SubhaVaastu.com

వాస్తుశాస్త్రం యొక్క విశిష్ఠత ఒక అద్భుతమైన విషయము అని చెప్పవచ్చును. వేల సంవత్సరాల క్రితమే ఈ వాస్తుశాస్త్రము యొక్క ఉనికి పూర్వ గ్రంధముల ద్వారా తెలుస్తున్నది. వాస్తు శాస్త్రము అనగా ప్రకృతి రీత్యా ఒక నిర్మాణాన్ని కావించడమే వాస్తు శాస్త్రము. భారతీయ సంస్కృతి అతి విలక్షణమైనది. దీనిలోని సిద్ధాంతములన్ని అత్యంత వైజ్ఞానికములు. వాటి ప్రధాన ఉద్ధేశము మానవలోక కళ్యాణము. మానవ జీవితము సుఖమయము చేయవలెననే భావము మన సంస్కృతిలో మిళితమై ఉన్నది. పాశ్చాత్య సంస్కృతిలో కర్మ సిద్ధాంతముతో పాటు భగవంతుని ప్రమేయము కూడా కనబడుతుంది. పూర్వ ఋషులు వైజ్ఞానిక దృక్పథంతో సమస్త మానవాళికి సుఖ సంతోషాలు కలగాలనే తలంపుతో అనేక శాస్త్రాలను మనకు అందించారు. వాటి యొక్క ప్రధాన ప్రయోజనము మానవ కళ్యాణము మరియు సంఘ సేవయే. మనిషి తాను తన కుటుంబము నివసించడానికి గృహమును నిర్మిస్తాడు. ఆ భవన నిర్మాణ విశేషాలను గురించి తెలియజేస్తూ ఋషులు అనేక వాస్తు విషయాలను భవిష్యత్ తరాల వారికి తెలియజేయడం జరిగింది.

సాధారణంగా మనిషి తన జీవితములో ఎక్కువ సమయము గృహములోనే నివసిస్తాడు. అట్టి గృహము వ్యక్తికి ధర్మ, అర్థ, కామ, మోక్ష కారకమైనది. భృగువు, అత్రి, వసిష్ఠాది ఋషులు, గృహ సంబంధ విషయాలను పరిశీలనాత్మక దృష్టితో వైజ్ఞానిక దృక్పథంతో తెలియజేశారు.

ఒక గృహము యొక్క నిర్మాణ క్రమాన్ని బట్టి దాని స్వరూపమును అనుసరించి అందు నివసించు వారికి శుభాశుభ ఫలితములు కలుగును. అటువంటి గృహముయొక్క నిర్మాణ విధానము తెలియజేయునది వాస్తు శాస్త్రము. గృహ నిర్మాణము శాస్త్ర విరుద్ధముగా ఉన్నను స్థలము యొక్క స్వరూపము శాస్త్ర విరుద్ధముగా ఉన్నను గృహములో నివసించు వారి జీవితము కలతలతో కూడియుండును. భూమి ఏ వస్తువునైనను తన వైపు లాగుకొనే శక్తి కలిగి ఉన్నది. దీనిని భమ్యాకర్షణ శక్తి అందరు. అటువంటి శక్తి కలిగిన భూమిపై నివసించే వ్యక్తుల యొక్క మానసిక స్థితి ఆ భూమి యొక్క స్వరూప స్వభావములననుసరించి మారుచుండును. ఒక స్థలము నందు గృహము నిర్మించుకొని అందు నివసించు వారి స్వభావ తీవ్రత ఆ స్థలము యొక్క స్వరూమునను సరించి ఉండును. నివసించు స్థలము యొక్క లక్షణములు శుభములైన అందు నివసించు వారు శుభ ఫలితములను పొందుదురు. ఆ స్థలము అశుభ లక్షణములు కలిగి ఉన్న అందు నివసించు వారు అశుభ ఫలితములను పొందుదురు. కొన్ని ప్రదేశములకు వెళ్లినప్పుడు మనసుకు ప్రశాంతత కలుగును. కొన్ని ప్రదేశములను చూచినప్పుడు చిరాకు ఏర్పడును. దానికి కారణం ఆ ప్రదేశములో ఉన్న స్థలము మరియు గృహముల యొక్క ప్రభావమని గుర్తించవలసిన అవసరమున్నది.

గృహ నిర్మాణము యందు ఇటుకలు సిమెంటు మున్నగు వస్తువులను ఉపయోగించుట జరుగును. ఇటుకలు మున్నగు వస్తువుల సముదాయము వలన ఇల్లు తయారు కాదు. ఆ ఇటుకలను సిమెంటు సాయంతో క్రమ పద్ధతిలో అమర్చి వాస్తుననుసరించి నిర్మించిన సరియైన విధముగా తయారగును. గృహ నిర్మాణములో అనేక మంది నిపుణులైన పని వారల కృషి అవసరమగును. గృహము నాలుగు దిక్కులు, నాలుగు విదిక్కులతో కూడుకొని యుండును. గృహము నందు అవసరమైన గదుల నిర్మాణము జరుగును. వీటినన్నింటిని క్రమపద్ధతిలో వాస్తు శాస్త్రానుసారము నిర్మించుట వలన గాలి, వెలుతురులకు ఏ విధమైన ఆటంకము లేకుండా ఉండును. ఆ గృహములో నివసించు వారు సుఖ సంతోషములతో ఉందురు. అట్లు కాక దిక్కులు, మూలలు, గదులు, ఉపగృహాలు నిర్మించుట యందు క్రమపద్ధతిననుసరించని యెడల సరియైన వాస్తు ఫలితములను పొందలేము.

శుభ లక్షణములు లేని గృహము నందు నివసించు వారు ఒకరిపై ఒకరికి అన్యోన్యతానురాగములు లేని వారై కుటుంబ జనులే ఒకరికి ఒకరు శత్రువులుగా మారిపోవుట జరుగును. దాని వలన కుటుంబములో అంత:కలహములు చెలరేగి బాధలు అధికమగును. ఇటువంటి సమస్యలు కలుగకుండుటకు సరియైన మార్గములో వాస్తుననుసరించి గృహ నిర్మాణం చేయవలెను.

మంచి జీవనానికి తిండి బట్ట ఇల్లు ప్రధానమైనవి. అటువంటి ఇంటిని వాస్తు ననుసరించి సరియైన పద్ధతిలో కట్టవలసిన అవసరమున్నది. గృహమును వాస్తుననుసరించి నిర్మించిన అందులో నివసించువారు తప్పక అభివృద్ధిని పొందగలరు. ఆర్థికాభివృద్ధితో పాటు సుఖము శాంతి గౌరవమును పొందు అవకాశము గృహస్థులకు కలుగును. అందువలన అభివృద్ధిని కోరు వారందరు వాస్తును తప్పనిసరిగా ఆచరించవలసిన అవసరమున్నది.

మనము ఇతరులను చూచి వాస్తును గుడ్డిగా అనుసరించవలసిన అవసరము లేదు. వాస్తును నమ్మకపోతే దోషము లేదు కాని వాస్తుననుసరించకపోతేనే వాస్తు దోషము కలుగుతుందని గ్రహించాలి. వాస్తును నమ్మిననూ లేదా నమ్మకపోయిననూ దాని ప్రభావము చూపడం జరుగుతుంది, అది మంచి కానీ లేదా చెడు కాని. గృహము యొక్క నిర్మాణ దోషములను గ్రహించి సరియైన విధముగా వాస్తుననుసరించి గృహమును నిర్మించిన వాస్తును నమ్మని వారికి కూడా శుభమే కలుగును. క్రమముగా అభివృద్ధి చెందు గృహములను సంతానాభివృద్ధి, విద్యాభివృద్ధి, ఆర్థికాభివృద్ధి గల గృహములను అధిక శుభములు కలుగు గృహములను పరిశీలించిన ఆ గృహములు వాస్తుననుసరించి నిర్మించినవిగా గుర్తించవచ్చును. ఆ గృహముల స్థితిగతులను పరిశీలించిన వాస్తును నమ్మని వారు కూడా వాస్తు యొక్క గొప్పతనము తెలిసికొని దానిననుసరించుటకు ప్రయత్నము చేయుదురు.

ప్రాచీన కాలంలో విద్యార్థులు గురుకులంలో 64 కళల్లో జ్ఞానాన్ని పొందేవారు. అందులో కొన్ని లుప్తమైనవి మిగిలిన కళల్లో వాస్తు కళ కూడా ఒకటి. మన ప్రాచీన వాస్తు గ్రంథాలలో ఎన్నో వైజ్ఞానిక విశేషాలు నిక్షిప్తమై ఉన్నవి. వాటి వైపు ఆధునికుల దృష్టి అంతగా మరలక పోవడం దురదృష్టముగా చెప్పుకోవచ్చు. పూర్వం నుంచి మన పూర్వీకులు వాస్తును ఆచరించడం జరుగుతోంది. అయితే శాస్త్ర రహస్యాలు అందరికీ అందుబాటులో లేకపోవడం కొన్ని శాస్త్ర రహస్యాలు సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని పూర్వపు మహర్షులు బహిర్గతం చేయకపోవడం వంటి ఎన్నో కారణాల వలన శాస్త్రము ఆచరణకు దూరమైనది. సమాచార విప్లవం వల్ల నేడు వాస్తు శాస్త్రమును బాగా ఆదరించడం జరుగుతున్నది. ఈ సమాచార విప్లవము పూర్వ కాలము లేనందువల్ల ఈ శాస్త్రము యొక్క గొప్పతనము అందరికీ అందుబాటులో లేకపోయింది.

వాస్తు శాస్త్రమును ప్రజలందరికీ అందుబాటులోకి తేవడానికి నా శాయశక్తులా కృషి చేయడం జరిగింది. ఎన్నో లక్షలు ఖర్చు పోసి www.SubhaVaastu.com వెబ్‌సైట్‌ను అభివృద్ధి పర్చడం జరిగింది. నేడు ప్రపంచ వ్యాప్తంగా ఈ వెబ్‌సైట్‌కు ఊహించనటువంటి ఆదరణ లభిస్తోంది. ఈ అద్భుతమైన విజయానికి కారణమైనటువంటి ప్రతి ఒక్కరికీ ధన్యవాదములు తెలుపుకుంటున్నాను. భారతదేశంలోని 14 బాషలలో ఈ వాస్తు గ్రంధాన్ని విడుదల చేయాలని తలంచి మీ ముందుకు రావడమైనది. అపారమైన మీ ప్రేమను ఈ వెబ్‌సైట్ మీద కూడా ప్రసరింపచేసి మీ గొప్పతనాన్ని చాటుకుంటారని తలుస్తాను. ఒక బాష నుంచి మరొక బాషకు విషయము తర్జుమా అయినప్పుడు ఎన్నో పొరపాట్లు జరగడానికి అవకాశం చాలా ఉంది. ఇందులో ఏమైనా పొరపాట్లు ఉన్నట్లయితే దయచేసి నాకు తెలియజేయగలరు.

# పూజ గది

పూర్వ కాలములో భగవంతుని పూజించడానికి వేసుకొనే గదిని బాగా విశాలంగా నిర్మించేవారు. ప్రత్యేకించి ఒక గదిని ఏర్పాటు చేసుకొనేవారు ఆ గది యందు పూజ చేయడం కొరకు వచ్చిన పూజారే (పంతులు, పురోహితుడు, స్వామి) కాక కుటుంబ సభ్యులు కూర్చోవడానికి కూడానూ తగినంత స్థలము ఏర్పాటు చేసుకొని దేవుని గదిని నిర్మించుకొనేవారు. కాలము మారుతూ వచ్చి దేవుని గది చిక్కిపోతూ చిక్కిపోతూ చివరికి గూళ్ళలో దేవుణ్ణి ఉంచి పూజించుకొనే పరిస్థితులు దాపురించాయి.

పూర్వపు ఋషులు వాస్తుశాస్త్రములో దేవుని గదికి ప్రత్యేకమైన స్థానమును చూపించారు. అదియే ఈశాన్య గది. ఈశాన్యములో ఎందుకు దేవుని గదిని ఉంచాలి? ఒకవేళ గృహములో దేవుని గదిని ఎక్కడ నిర్మించు కొన్ననూ దోషము ఉందా లేదా? ఇటువంటి ప్రశ్నలు చాలా మంది మదిలో మెదులుతుంటాయి. ఇప్పటికీ చాలా గృహాలలో దేవుని గది ఈశాన్య భాగములో ఉండడం మనము గమనించవచ్చు.

ఈశాన్య భాగము ఏ మాత్రమూ బరువులు మోయలేనిది. చెత్త చెదారము లేక చాలా శుభ్రతగా ఉంచుకోవలసిన ప్రాంతము. ఒక్క దేవుని గది తప్ప ఈశాన్య భాగములో ఏమున్ననూ బరువులు ఉంచుతాము. అందుకొరకే ఈశాన్య భాగములో ఏ గదిని చూపించక దేవుని గదిని చూపించడం జరిగినది. ఇదే విధానముననే చాలా మంది గృహములో ఈశాన్యభాగంలో పెద్ద హాలు ఉన్ననూ ఆ హాలుకు ఈశాన్య భాగములో దేవుని గది ఉంచి చిన్నపాటి తప్పు చేస్తున్నారు.

దేవుని గదిని ఒక్క నైఋతి గదిలో తప్ప గృహము నందు ఎక్కడైననూ ఏర్పాటు చేసుకోవచ్చు. నైఋతి భాగములో దేవుని గది ఏర్పాటు చేసుకోవడం వల్ల ఏ బరువులూ లేక నైఋతి దోషమగును. కావున నైఋతి గదిలో దేవుని గదిని ఏర్పాటు చేసుకోవడం వద్దు.

దేవుని గదిని తూర్పు యందు లేదా ఉత్తరము యందు ఏర్పాటు చేసుకోవడం మంచిది. పూజా గది ఈ ప్రాంతములలో చక్కగా అమరగలదు. నా వరకు నా సూచన ఏమంటే దేవునికి ప్రత్యేకించి గృహములో ఓ గదిని ఏర్పాటు చేసుకోవడం మంచిది. అప్పుడే గృహముయందు పూజలు చేసుకున్ననూ మనస్సు శాంతముగా ఉంటుంది. అట్లుగాక ఎక్కడో గూడులో లేదా గోడకానించిన బండలపై దేవుణ్ణి ఏర్పాటు చేసుకొని పూజించడం వల్ల అంతగా భక్తి ప్రభావము ఉండకపోవచ్చు. అయితే మారుతున్న కాలములో స్థల ప్రభావం వల్ల ప్రజలు కూడానూ దేవుని గది నిర్మాణానికి మొగ్గు చూపక వంటగదియందే ఓ ప్రాంతమును దేవుని గదిని రూపొందించుకొని పూజలు చేసుకుంటున్నారు.

భగవంతునికి ప్రత్యేకించి ఓ గదిని నిర్మాణం చేసుకొని శ్రద్ధగా ఆ గది అంతయూ శుభ్రం చేసి పూలు, పళ్ళు తదితరములు సమర్పించుకొని అగరబత్తిలు వెలిగించి, దీపములు పెట్టి, హారతిని ఇచ్చిన తరువాత వచ్చిన తృప్తి దినములో ఏ కార్యక్రమమును చేసిననూ ఇంత తృప్తి లభించదు. తప్పని సరిగా మీరు దైవారాధనకు కూర్చున్నప్పుడు భగవంతునికి కచ్చితముగా ఏదో ఒకటి సమర్పించాలి. చక్కెర పాలు కానీ, లేదా ఆహార పదార్థములు కానీ ఈ రెండూ అనుకూలము లేకపోతే కనీసం నీళ్ళయందు చక్కెరనైనా వేసి, చక్కెర కూడా లభ్యత లేకపోతే కాసింత బెల్లం వుంట నైననూ భగవంతునికి సమర్పించుకోవడం చాలా మంచిది. సర్వేశ్వరుని దయ కొరకు శ్రద్ధగా పూజా కార్యక్రమములు చేసుకోవలెను. సర్వేశ్వరుని తరువాతనే ఏదైననూ, కుటుంబ సభ్యులు కానీ, వాస్తుకానీ, సంపాదన కానీ, బంధుమిత్రులు కానీ, ఆస్థి పాస్థులు కానీ, సుఖ సంతోషాలు కానీ, షికారులుకానీ, టి.వి. చూడడం కానీ.

ఆగ్నేయములో వంటగది పోగా తూర్పు భాగము యందు దేవుని గదిని ఏర్పాటు చేసుకోవడం చాలా మంచిది. ఈ గదియందు దేవుడిని ఉంచడానికి అరుగు నిర్మించుకోరాదు. చక్క బల్లను తయారు చేయించుకొని దానిపై దేవుడిని ఉంచుకొని పూజించడం శుభకరము. ఈ చెక్క బల్ల కూడా తూర్పు గోడను తాకకుండా ఏర్పాటు చేసుకోవడం చాలా మంచిది.

ఇలా కాకుండా ఉత్తర భాగము యందు దేవుని గది వచ్చినచో ఆ గది యందు ఉత్తరపు గోడకు ఆనించి అరుగు నిర్మాణం చేయరాదు. ఒక చెక్క బల్లను ఏర్పాటు చేసుకొని అందుపై దేవుడిని ఉంచుకొని పూజించడం శుభకరము. ఈ చెక్క బల్ల కూడా ఉత్తర గోడకు తాకరాదు.

దక్షిణ భాగములో దేవుని గది ఉన్నచో పశ్చిమ గోడకు ఆనుకొని అరుగు నిర్మించుకొని అరుగుపై దేవుని పూజించడం శ్రేష్టము. లేదా తూర్పు గోడకు ఆనుకోకుండా చెక్క బల్లపై దేవుని ఉంచి పూజించడం మంచిది.

పశ్చిమ భాగములో దేవుని గది ఉన్నచో పశ్చిమ గోడకు ఆనించి అరుగును నిర్మించుకొని అందుపై దేవుడిని ఉంచి

పూజించడం శ్రేయస్కరము. ఈ విధానములో మనము దేవుని పూజ చేయునప్పుడు పశ్చిమ ముఖముగా కూర్చుంటాము. ఇందు ఏ దోషమూ లేదు.

అన్నిటికన్నా ఉత్తమమైన విధానము ఒకటి ఉన్నది. ఈ నిర్మాణ విధానము చాలా మందికి తెలియక పోవచ్చు. అదియే చుట్టు దేవుని గది. అనగా ఇంటి యందలే దేవునికి ఒక గదిని నిర్మిస్తాము. ఈ గది చుట్టూ తిరగడానికి దారి కూడా ఏర్పాటు చేసుకుంటాము. ఈ నిర్మాణ క్రమము బహు శ్రేష్టము. అత్యుత్తమ ఫలితములనిచ్చే విధానము ఒకటి కలదు. నన్ను సంప్రదిస్తే సూచించగలను.

## వంటగది (కిచెన్ రూం)

కిచెన్‌ను వంటగదిగానూ లేదా వంటిల్లు గానూ పిలుస్తారు.

వంటగది గృహమునకు ఆగ్నేయ భాగములో రావడం ముదావహము. కచ్చితంగా సరైన పద్ధతి. ఎటువంటి పరిస్థితులలోనూ వంటగదిని ఈశాన్యము భాగములో ఏర్పాటు చేసుకోవద్దు.

ఒకవేళ ఈశాన్య భాగములో వంటగది ఉన్నచో విపరీతమైన ఖర్చు, భార్యా భర్తల మధ్య తగువులు తదితర బాధలతో గృహస్థులు అనేక ఇబ్బందులకు గురి కావలసి ఉంటుంది. గృహమునందు వంటగదిని ఆగ్నేయ భాగమునందు ఏర్పాటు చేసుకోవడానికి అనుకూలం లేకపోతే వాయువ్య భాగములో ఏర్పాటు చేసుకోవచ్చు.

ఈ వాయువ్య భాగంలో తూర్పుకు తిరిగి వంటచేయడం శుభకరము. ఒకవేళ వాయువ్య వంటగదిలో ఆగ్నేయ భాగమున వంట చేసుకోవడానికి అనుకూలం లేకపోతే పశ్చిమ ముఖము చేసి వంట తయారు చేసుకున్ననూ ఏ దోషమూ లేదు. వంట చేయడానికి గ్యాస్ పొయ్యి తదితరములు ఉంచడానికి అరుగును ఏర్పాటు చేసుకుంటాము కదా. అ అరుగును ఎటువంటి పరిస్థితులలోను ఉత్తర భాగమునకు కట్టి ఉత్తర ముఖము చూస్తూ వంట చేయడం మహాదోషము. పశ్చిమ గోడకు అనించి కట్టిన అరుగు వాయువ్య భాగము వరకే ఆగిపోవాలి, ఉత్తర గోడకు ఆనుకోరాదు, క్రింది పటములో లాగా ఏర్పాటు చేసుకోండి.




గృహమునకు వాయువ్య భాగంలోని వంటగది నమూనాను గమనించారు గదా. దక్షిణ గోడకు ఆనుకొని ఆగ్నేయము వరకు అల్మారాలు గానీ లేదా అరుగులను నిర్మించుకోవచ్చు. ఒకవేళ వంటగది పక్క డైనింగ్ రూం ఉన్నచో దానికి ద్వారము వదులుతూ అల్మారాలను నిర్మించుకోవచ్చు. వాయువ్య భాగంలో కొళాయి (షింక్) ఏర్పాటు చేసుకోవచ్చు. వంట కొరకు ఏర్పాటు చేసుకున్న అరుగు కాక పై భాగంలో ఉత్తర గోడకు తాకకుండా అటకను కూడా ఏర్పాటు చేసుకొని దానిపై వంట సామాగ్రిని నిరభ్యంతరంగా ఉంచుకోవచ్చును.

గాలికొరకు వెంటిలేటర్‌ను పశ్చిమ గోడకు వాయువ్య ప్రక్క పై భాగములో ఏర్పాటు చేసుకోవచ్చు. ఎగ్జాస్ట్ ఫ్యానును కూడా స్టౌవ్‌కు పై భాగములో సాధ్య మైనంతవరకు వాయువ్య పక్కకు వెళ్ళులాగున ఏర్పాటు చేసుకోవచ్చు. లేదా ఉత్తర గోడకు ఏర్పాటు చేసుకోవచ్చు. కావాలంటే కిటికీలను ఉత్తర గోడకు ఈశాన్య భాగములో ఏర్పాటు చేసుకోవచ్చు.

గృహములో వాయువ్య భాగములో నిర్మించిన వంటగది నిర్మాణము ఉత్తర, దక్షిణ కొలతల కన్ననూ తూర్పు, పడమర కొలతలు ఎక్కువగా ఉండు లాగున చూసుకోవాలి. ఒకవేళ ఉత్తర, దక్షిణ కొలతలు తూర్పు, పడమర కొలతల కన్నా ఎక్కువైననూ వంటగదికి తూర్పు ఈశాన్యములో ద్వారమున్నప్పుడు ఏ తొందరా లేదు.

**ఆగ్నేయ భాగములో వంటగది :** నూటికి తొంభైశాతం వంటగదిని ఆగ్నేయ భాగములోనే ఏర్పాటు చేసుకుంటారు. పూర్వమూ ఇదే పద్ధతి, ఇప్పుడూ ఇదే పద్ధతే. అయితే పూర్వ కాలములో వంటగదిని ఇంటికి తప్పించి ఆగ్నేయ భాగములో వేసుకొనేవారు. ఇప్పటికీ చాలా గ్రామములలో ఇదే విధానాన్ని ఆచరిస్తున్నారు. స్థలాభావము వల్ల వంటగది కూడా ఇంటిలోనికి చేరినది.




పై పటము నమూనా వంటగది గృహమునకు ఆగ్నేయ భాగములో ఉండునది. కావుననే దీనికి తూర్పు, దక్షిణము మాత్రం చూపించడమైనది. మిగిలిన ఉత్తర, పశ్చిమములయందు గృహమున్నందువల్ల దిక్కులకు చూపించలేదు. ఈ వంటగదిలో అరుగును పటములో చూపించిన విధముగా తూర్పు గోడకు తగలకుండా వేసుకోవడం చాలా మంచిదని గమనించాలి. అయితే నేడు నూటికి 99 శాతం తూర్పు గోడకు ఆనించి అరుగును నిర్మించుకుంటున్నారు. దక్షిణము గోడకు అరుగు తగలవలెను. ఉత్తరము గోడకు అరుగు తగలకుండా షింక్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇదే వంటగదిలో పశ్చిమ గోడకు ఎంతటి బలమైన అరుగులను ఎన్నైననూ నిర్మించుకోవచ్చును. ఈ తూర్పు గోడకున్న అరుగుకు పై భాగములో అటక ఉండరాదు.

ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను ఆగ్నేయ భాగములో గానీ లేదా దక్షిణ ఆగ్నేయ గోడకు గానీ బిగించుకోవచ్చు. తలుపుకెదురుగా దక్షిణ గోడకు కిటికీని ఏర్పాటు చేసుకోవచ్చు. తూర్పు గోడకు వేసుకున్న అరుగు కాక పశ్చిమ గోడకు వేసుకున్న అల్మారాలు కాక దక్షిణ గోడకు ఇక ఏ ఇతర అరుగులు రాకూడదు.

ఆగ్నేయ భాగములో ఉన్న వంటగది నిర్మాణము తూర్పు పడమర కొలత తక్కువగాను ఉత్తర దక్షిణములు ఎక్కువ కొలతలు ఉండులాగున చూసుకోవాలి. ఒకవేళ తూర్పు, పడమరల కొలతలు ఉత్తర, దక్షిణ కొలతల కన్నా ఎక్కువగా ఉంటే, వంటగదికి ఉత్తర ఈశాన్య గోడకు ద్వారమున్నచో ఏ తొందరా లేదు.

**కిచెన్‌లో దక్షిణ గోడకు అరుగు ఎందుకు తగులరాదు**

కిచెన్ ఇంటికి ఆగ్నేయ భాగాములో ఉన్నప్పుడు అరుగును దక్షిణ గోడకు తగిలించరాదు అని చెబుతుంటారు. ఈ మాట నిజమే.




పై పటములోని వంటగదిలో అరుగు దక్షిణ ఆగ్నేయము గోడకు ఆనుకొని ఉంది. యారో మార్కును గమనించండి. ఇప్పుడు ఈ క్రింది పటములో దక్షిణగోడకు ఆగ్నేయ భాగములో ఆనుకొని వున్న అరుగు లేదు.




పై విధమైన నిర్మాణం వల్ల తూర్పు ఆగ్నేయము తగ్గును. ఈ విషయాన్ని వివరంగా తెలపవలెనన్న 1, 2 పేపర్లలో వీలయ్యే పని కాదు. ఇది వాస్తు రహస్యాల్లో ఒక భాగము. చదివినంత మాత్రానే పూర్తిగా అర్థమవుతుందనుకోవడం కూడా కష్టమే. అనుభవజ్ఞులకు బాగా అర్థమవ్వగలదు.

ఏది ఏమైననూ వాస్తు శాస్త్రమును పాటించు సమయంలో ఒక అనుభవజ్ఞుడైన వాస్తు శాస్త్రవేత్త సలహాను పొందడం చాలా మంచిది. తెలివైన వారు సాధారణంగా వాస్తు శాస్త్రవేత్తను గృహ పరిశీలనకు పిలిపించుకొని తగిన సలహాలు, సవరణలను పొంది లాభ పడుతుంటారు. మీరు తెలివైన వారు కదా.

## బెడ్‌రూం (పడక గది)

సాధారణంగా గృహమునకు పడకగదిని నైఋతి భాగములో ఏర్పాటు చేసుకుంటారు. గృహస్థుడు పడకగదిని వాడడం వల్ల తద్వారా నైఋతి భారమై, మరియు గృహస్థుడు బయటకు రావలెనన్న ఈశాన్య ద్వారము ద్వారా బయటకు రావలసి ఉంటుంది కాబట్టి వాస్తు రీత్యా గృహస్థుడు ఉచ్ఛస్థితికి చేరుకోవడానికి అవకాశం ఉంటుంది. భద్రతా భావము ఏర్పడుతుంది.

పూర్వము నుండి పడకగదిని ఇంటికి వెలుపల ఏర్పాటు చేయలేదు. వంట గదిని, స్నానాల గదిని ముఖ్య గృహమునకు వెలుపల నిర్మించేవారు. కానీ ఏనాడూ పడకగదిని ముఖ్య గృహమునకు బయట ఏర్పాటు చేయలేదు. కారణం పడకగదిలో ఇనుపపెట్టె లేదా ధనము నిలువ చేసుకొనే బీరువాలను గానీ, అల్మారాలను గానీ ఏర్పాటు చేసుకున్నందువల్ల మరియు ముఖ్య గృహము నందే నిద్ర చేయడం భద్రతారీత్యా మంచిది కావున ముఖ్య గృహములోనే పడకగదిను ఏర్పాటు చేసుకుంటున్నారు.

నా ఆలోచనగా గృహము మరియు గృహస్థుని ఆస్థులన్నియూ ఒక ఎత్తు గృహస్థుని పడకగది ఒక ఎత్తు. ఎందుకనగా గృహస్థుడు ఎక్కడ తిరిగి, ఏమి చేసినా, ఎన్ని వ్యవహారాలాడినా చివరికి ఇంటికి చేరుకొనును. అదియునూ ఇంటి యందు కూడా ఎక్కువ సమయము పడకగదిలో ఉంటాడు. **ఎవరైనా ఎక్కువ సమయం ఏ గదిలో అయితే ఉంటారో ఆ గది వాస్తు ప్రభావం వారిపై ఉంటుంది.** ఆ గది వాస్తు మంచిది గానీ, చెడ్డదిగానీ దాని యొక్క ప్రభావం ఆ గృహస్థునిపై కచ్చితంగా పనిచేస్తుంది. నా సూచన ఏమంటే ఒకవేళ మీ గృహము వాస్తురీత్యా సరిచేయించుకోవడానికి అనుకూలముగా లేకపోతే కనీసం మీ పడకగదినైనా వాస్తురీత్యా సరిచేయించుకొని నిద్రలు కావించినచో ఆ పడకగది యందలి శుభవాస్తు ప్రభావం ఆ గృహస్థునిపై యుండి అతను శుభఫలితములు పొందే అవకాశం చాలా ఎక్కువ.

గృహముయందు పడకగదిని ఎప్పటికీ నైఋతి భాగములోనే ఏర్పాటు చేసుకోవడం శుభకరము. ఇంతకన్ననూ ఇంకో విధానము ఇంకా ఎక్కువ శుభ ఫలితములను ఇచ్చును. అదియే నైఋతి యందు స్టోరు రూం మరియు దాని ప్రక్కగా పశ్చిమ వైపుగానో లేదా దక్షిణ వైపుగానో పడకగదిని నిర్మించుకొని వాడుకోవడం శ్రేష్ఠమైన పద్ధతి. ఒకవేళ నైఋతి భాగంలో స్టోర్‌రూంను ఏర్పాటు చేసుకున్నట్లయితే ఆ స్టోర్‌రూం నేల భాగమును మిగిలిన గృహము నేల మట్టము (ఫ్లోరింగ్) కన్ననూ ఎత్తుగా ఉండడం అన్ని విధాలా శుభకరము. ఇది ఫస్ట్‌క్లాస్. చాలా మంది స్టోర్ రూంను నైఋతి భాగములో వేసుకోవడానికి ఇష్టపడరు. ఎక్కువ శాతం ప్రజలు పడకగదిని నైఋతి భాగములోనే ఏర్పాటు చేసుకుందురు. స్టోర్‌రూంను ఇంకో ప్రాంతములో ఏర్పాటు చేసుకుంటారు.

క్రింద కొన్ని నైఋతి గదియందలి పడకగది నమూనా పటములను ఇస్తున్నాను. ఈ విధంగా కొందరు ఆచరిస్తుంటారు.




పైన పటములోని నమూనా గృహము యొక్క నైఋతి గదియందలి పడకగది. దీనికి దక్షిణము మరియు పడమర దిక్కులను మాత్రము చూపించడమైనది. మిగిలిన తూర్పు మరియు ఉత్తర దిక్కుల యందు గృహము ఉంటుంది కావున వాటిని చూపించలేదు. ఇది సాధారణమైన పడకగది. ఎప్పటికీ పడకగదిలో తూర్పు ఈశాన్యముగానీ ఉత్తర ఈశాన్యము గానీ పెరుగునట్లు చూసుకోవాలి. పై పటముయందలి పడకగదికి తూర్పు ఈశాన్యము గానీ, ఉత్తర ఈశాన్యముగానీ పెరగలేదు. అయితే ఉత్తరములో మాత్రము బాత్‌రూం ఉన్నది. పూర్తిగా ఉత్తరము అంతయూ బాత్‌రూం కట్టివేయబడినది.




ఈ పడకగదికు బాత్‌రూం ఉత్తర వాయువ్యము పెరుగుతూ ఉన్నది. చాలా మంది ఇంజనీర్లు ఈ విధంగా కూడా ప్లాన్ వేస్తువుంటారు. అయితే వాస్తు పాటించడం అన్న తరువాత 100 శాతము వాస్తు పాటించాలి. తక్కువ, ఎక్కువగా వాస్తు పాటించడం కూడదు. ఈ విధానములో బాత్‌రూంకు డోర్ ఉన్నందువల్ల ఉత్తర వాయువ్యము పెరుగుదల ఉండదు అని తెలుపుతారు, మరియు మిగిలిన తూర్పు ఉత్తరముల యందు మిగతా గృహమున్నందువల్ల ఏ దోషమూ లేదంటారు. నిజమే, అయితే వాకిలి తెరిస్తే మాత్రము పడకగదికి ఉత్తర వాయువ్యము పెరిగి నట్లే కదా. ఒక్క శాతం దోషమైననూ తగలకూడదు అనేది నా విధానము.




ఈ నమూనా పడకగదికి తూర్పు ఆగ్నేయము పెరుగుతూ బాత్‌రూం ఉన్నది. దీనికి కూడా దోషము లేదని తెలుపుతారు. నేను కాదనను ఉత్తమమైన ఫలితములు వచ్చే బాత్‌రూం గల పడకగదిని ఏర్పాటు చేసుకోండి.



4వ పటము యందలి నమూనా పడకగదికి నైఋతి భాగమున బాత్‌రూం ఉన్నది. ఈ విధంగా నైఋతి భాగంలో నీళ్ళు పోవడానికి గుంత ఉండడం తప్పు కదా. ఎంత కాదనుకున్నా చిన్నపాటి గుంత అయిననూ బాత్‌రూంలో ఉంటుంది. ఈ దోషము కూడా మీకు వద్దు. అద్భుతమైన ఫలితముల నిచ్చే రెండు బాత్‌రూంలు గల పడకగది నమూనా పటములను మీకు తెలుపుతాను. ఆ విధంగా మీరు నిర్మించుకోండి. పడకగదిలో ఈశాన్యము పెరగడం శుభకరము.







పై పటముల యందు చూపించిన నమూనా బాత్‌రూం గల బెడ్‌రూం లను గమనించండి. 5వ పటమునకు ఉత్తర ఈశాన్యము పెరిగినది. 6వ పటమునకు తూర్పు ఈశాన్యము పెరిగినది. ఈ రెండూ నమూనా పటముల నిర్మాణము చేసుకోవడం వల్ల బ్రహ్మాండమైన ఫలితములను మీరు పొందవచ్చును. 5వ పటము బెడ్‌రూంను తూర్పు, పడమర తక్కువుండి, ఉత్తరము, దక్షిణము ఎక్కువ గల గృహమునకు బాగా సరిపోతుంది.

## స్టోర్ రూం

స్టోర్‌రూంనే సామాన్ల గది అని కూడా అంటారు. ఈ స్టోర్ రూంను నైఋతి భాగంలో ఉంచుకోవడం శ్రేష్ఠమైన విధానము. ఒకవేళ నైఋతి భాగంలో ఉంచుకోవడం ఇష్టం లేకపోతే పశ్చిమదిక్కుకు లేదా దక్షిణ దిశకు ఉంచుకోవడం శుభకరము. గృహము యందలి తూర్పు మరియు ఉత్తర గోడలకు ఆనుకొని స్టోర్‌రూంను ఏ పరిస్థితులలోనూ వేసుకోవద్దు.

గృహముయందలి దక్షిణ మరియు పశ్చిమ గోడలకు ఆనుకొని వేసుకున్న స్టోర్ రూంలకు ద్వారమును ఈశాన్య భాగములో ఉంచుకోండి. లోపల ఎన్ని అరలైననూ లేదా అటకలైననూ నిర్మించుకోవచ్చును.

ఈ స్టోర్ రూంను కిటికీలు లేకుండా వేసుకోవడం మంచిది. వెంటిలేటర్ వేసుకోవాలి. కాస్తైనా గాలి ఆడుతుండాలి. స్టోర్‌రూంకు కొలతలతో పనిలేదు.

# డైనింగ్ రూం

పూర్వము వంట గదిలోనే ఆహారమును భుజించేవారు. కొన్ని ఇళ్ళయందు వంటగది చిన్నగా ఉన్నందువల్ల భుజించడం కొరకు ఓ గదిని ప్రత్యేకముగా ఏర్పాటు చేసుకొనేవారు.

ఈ కాలంలో భుజించడం కొరకు ప్రత్యేకించి ఓ గది ఉన్ననూ (డైనింగ్ రూం) చాలా మటుకు ఎక్కువమంది ఎక్కువ పాళ్ళు టి.వి. ఉన్న చోటనే కూర్చొని చేతిలో కంచాలను పట్టుకొని భుజించడము రివాజైనది. ఇప్పుడు స్థూపాకారంగా డైనింగ్ రూం తయారైనది.

సాధ్యమైనంత వరకు డైనింగ్ రూంను కిచెన్‌కు దగ్గరగా ఏర్పాటు చేసుకోండి. సాధారణంగా వాస్తురీత్యా నిర్మించుకొన్న గృహాల వారికి వంటగది ఆగ్నేయ భాగములో ఉంటుంది కదా. ఈ గదికి దగ్గరగా డైనింగ్ రూంను ఏర్పాటు చేసుకున్నచో ఇంటి మొత్తనికి డైనింగ్ రూం ఆగ్నేయ భాగములో ఉన్నట్లే కదా. గృహస్థుడు డైనింగ్‌రూంలో నైఋతి భాగాన కూర్చొని తూర్పును చూస్తూ ఆహారము భుజించడము మంచిది. తిన్నది బాగా అరుగుతుంది. ఆరోగ్యము బాగుంటుంది. మనసు శాంత పడుతుంది.




పై పటము యందు గృహములో గల వంటగది మరియు డైనింగ్ రూం లను మాత్రము చూపిండమైనది. ఈ వంటగదికి తూర్పు, దక్షిణములు మాత్రం చూపించడాన్ని గమనించండి. మిగిలిన పశ్చిమ, ఉత్తరముల యందు గృహము ఉంటుంది కదా.

ఈ వంటగది, డైనింగ్ రూం నమూనా తూర్పు, పశ్చిమ, ఉత్తర గృహములకు సరిగా సరిపోతుంది.

ఇక్కడ ఓ ముఖ్య విషయాన్ని మీరు గమనించాలి. చాలామంది వంట గది డైనింగ్ రూం పై విధానంలో ఏర్పాటు చేసుకున్నా, వంటగదికి ఉత్తర ఈశాన్యములో ద్వారమును ఏర్పాటు చేసుకోరు. ఇది చాలా తప్పు. తప్పని సరిగా వంటగదికి ఉత్తర ఈశాన్య భాగములో గానీ ఉత్తర భాగముయందు కానీ ద్వారమును ఏర్పాటు చేసుకొనే తీరాలి.

పైగా వంటగదికి డైనింగ్ రూంకు మధ్య గోడకు వాయువ్య భాగంలో దారి ఉండడం వల్ల సిద్ధమైన వంట పదార్థములన్నియు డైనింగ్ రూంకు తీసుకొని పోవచ్చు. అలా కాక కొందరు వంటగదికి, డైనింగ్ రూంకు మధ్య ద్వారము ఏర్పాటు చేసుకోకుండా కిటికీ మాదిరి ఖాళీ ప్రాంతమును ఏర్పాటు చేసుకుంటారు. దాని ద్వారా సిద్ధమైన వంట పదార్థాలను డైనింగ్ రూంకు అందించుకుంటారు. ఈ విధానములో ఎటువంటి దోషమూ లేదు, పైగా శుభకరము కూడానూ.




పై పటమును గమనించండి. ఈ వంటగది డైనింగ్‌రూం నమూనా దక్షిణ వీధి గృహస్థులకు సరిపోతుంది. దక్షిణ వీధి గృహస్థులకు ఆగ్నేయ భాగంలో వంటగది ఏర్పాటు చేసుకోవడానికి అనుకూలం లేకపోతే వారికి ఈ విధానము బాగా సరిపోతుంది.

పై నమూనా గృహమునకు వాయువ్య భాగంలో ఉంటుంది. కావుననే ఉత్తరము మరియు పశ్చిమ భాగమునకు చూపించడమైనది మిగిలిన తూర్పు మరియు దక్షిణ భాగములలో మిగతా గృహము ఉన్నందువల్ల చూపించలేదు.

ఈ నమూనాలో పై వంట గదికి తప్పనిసరిగా తూర్పు ఈశాన్య భాగమున ద్వారము ఉండే తీరాలి. వంట గది నుండి డైనింగ్ రూంకు మధ్యన గల గోడ పై భాగములో ద్వారము ఏర్పాటు చేసుకొని సిద్ధమైన వంట పదార్థాలను డైనింగ్

రూంకు తరలించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఒకవేళ వంట గది మరియు డైనింగ్ రూంకు మధ్యన దారి లేకపోయినచో కిటికీ మాదిరి ఖాళీ ప్రాంతమును ఏర్పాటు చేసుకొని దీని గుండా సిద్ధమైన పదార్థములను డైనింగ్ రూంకు తరలించడానికి ఏర్పాటు చేసుకోవచ్చును. ఇది సరైన విధానమే.

## లివింగ్ రూం

దీనినే హాలు అని కూడా అంటాము. ఇంకా డ్రాయింగ్ రూం అని లేదా లివింగ్ రూం అని కూడా అంటారు.

ఎవరైనా ఇతరులు మనతో మాట్లాడ డానికి వస్తే సిట్టింగ్‌రూంలో (హాలు) కూర్చోబెట్టి మాట్లాడతాము. ఈ సిట్టింగ్ రూం వాస్తురీత్యా ఉంటే వ్యవహారముల యందు మనకు విజయం లభిస్తుంది. గృహస్థుడు ఎప్పటికీ సిట్టింగ్ రూంలో తూర్పును గానీ, ఉత్తరమును గానీ చూస్తూ కూర్చోవాలి. ఇంకా సరైన విధంగా చెప్పాలంటే తూర్పు, పడమర వీధి గృహస్థుల గృహములు ఒకవేళ తూర్పు, పడమర గృహము ఎక్కువగా ఉండి ఉత్తర, దక్షిణ కొలతలు తక్కువగా ఉన్నచో వీరి సిట్టింగ్ రూం ఈశాన్య భాగములో ఉన్నచో, సిట్టింగ్ రూంలో నైఋతిలో గల సోఫా యందు ఉత్తరమును చూస్తూ కూర్చోవడం శుభకరం. ఆదాయవృద్ధి. ఒకవేళ వాయువ్యములో సిట్టింగ్ రూం ఉంటే అందు నైఋతి భాగంలో గల సోఫాలో తూర్పు పక్క చూస్తూ కూర్చోవడం ఉత్తమము, వ్యవహార విజయము. వచ్చిన వారితో మాట పెరిగిననూ చివరకు మీ మాటే నెగ్గుతుంది.

ఉత్తర, దక్షిణ వీధి గృహస్థుల గృహము యందు సిట్టింగ్ రూం ఈశాన్య భాగములో ఉన్నచో ఉత్తర వీధి గృహస్థులు సిట్టింగ్ రూంలో నైఋతిలోగల సోఫాయందు ఉత్తరమును చూస్తూ కూర్చోవడం ఉత్తమ ఫలితములను ఇస్తుంది. అదే దక్షిణ వీధి గృహస్థులు సిట్టింగ్‌రూం ఆగ్నేయ భాగములో ఉంచుకున్నట్లయితే, సిట్టింగ్ రూంలో నైఋతిభాగములో గల సోఫాయందు తూర్పు మాత్రం చూస్తూ కూర్చోవడం మంచిది కాదు. వీరు ఉత్తరం ముఖము చేస్తూ కూర్చోవడం మంచిది.

ఇదే విధానము దక్షిణ వీధి గృహస్థులకు నైఋతిలో సిట్టింగ్ రూం ఉంటే నైఋతి భాగంలో సోఫాయందు ఉత్తరమును చూస్తూ కూర్చోవడమే ఉత్తమ విధానం. తూర్పును చూస్తూ కూర్చోవడం వద్దు. కొందరు సిట్టింగ్ రూంను వేరుగా హాలును వేరుగా చెప్పుదురు. అయినా ఏ తొందరా లేదు. దేనికంటే ఒక్కో ప్రాంతములో ఒక్కో విధమైన పేరుతో పిలుస్తారు. ఒక్క విషయమును మాత్రం ఎప్పటికీ మరువరాదు. గృహములో బెడ్ రూం తర్వాత లివింగ్ రూంలోనే మనము ఎక్కువ సమయము గడుపుతాము. కావున లివింగ్ రూం మరియు అందలి ఫర్నీచర్‌ను వాస్తు శాస్త్ర రీత్యా ఏర్పాటు చేసుకున్నట్లు అయితే చాలా మంచి ఫలితాలను పొందవచ్చును.

## బాత్ రూం

బాత్ రూం నిర్మించుకునే విషయంలో అజాగ్రత్త లేకుండా కొన్ని వాస్తు నియమాలు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి. బాత్ రూం ఏం చేస్తుందిలే, దీనికి కూడా వాస్తు శాస్త్రము సలహా తీసుకోవడం దండగ అనుకుంటే పొరపాటు జరుగుతుందని భావించాలి. కేవలం ఒక్క బాత్ రూం విషయంలో కోటీశ్వరులు అయిన ఒక కుటుంబం సర్వనాశనం అయిపోయింది. గృహములో బాత్‌రూంలు ఏర్పాటు చేసుకోకుండా గృహము బయట ప్రహరీలో బాత్ రూంను ఏర్పాటు చేసుకున్నారు. అది ఎక్కడనో తెలుసా! ప్రహరీ కాంపౌండ్‌లో ఈశాన్య భాగములో బాత్ రూంలు ఏర్పాటు చేసుకొని నిండా నాశనమయ్యారు.

గృహములో బాత్ రూంలు వాయవ్య భాగం లేదా ఆగ్నేయ భాగం రావడం చాలా మంచిది. గత్యంతరము లేని పరిస్థితుల్లో నైరుతి భాగంలో కొన్ని వాస్తు నియమాలను పాటించి ఏర్పాటు చేసుకోవచ్చు. ఎటువంటి పరిస్థితులలోనూ ఈశాన్య భాగములో బాత్ రూంను ఏర్పాటు చేసుకోరాదు.

ప్రస్తుతం మనం గృహములో బాత్ రూంలను ఎక్కడ ఏర్పాటు చేసుకోవాలో చూద్దాము.



పై పటములో చూపిన విధంగా పడక గదిలో బాత్ రూంను నిర్మించుకోండి. పడక గదిలో బాత్‌రూమ్ వాయవ్య మూలన వచ్చి ఉత్తర ఈశాన్యము పెంచినట్లు అయినది.




పై పటములో చూపిన విధంగా బాత్ రూంను పడక గది ఆగ్నేయ భాగములో నిర్మించుకోండి. తద్వారా పడక గదికి తూర్పు ఈశాన్యము పెరిగినట్లు అగును. ఇదే విధంగానే గృహము బయట బాత్ రూంను తూర్పు ఆగ్నేయ భాగములోనూ లేదా ఉత్తర వాయవ్యంలో ఏర్పాటు చేసుకోండి. అయితే ముఖ్య గృహమునకు ఈ బాత్ రూం తగలడం మంచిది కాదు. ఒకవేళ తగిలినచో కొన్ని సవరణలు చేయవలసి వుంటుంది.

వాస్తు పుస్తకాల వల్ల వాస్తు శాస్త్రంపై విజ్ఞానం పెరుగుతుంది. అలాగని గృహ నిర్మాణం సాగించి నష్టపోయిన ఎందరినో చూడడం జరిగినది. వాస్తు శాస్త్రవేత్త సలహాను పాటించి మాత్రమే ఏ నిర్మాణమునైనా సాగించండి. అది మీకు, మీ పిల్లలకు ఎంతనో మంచి చేస్తుంది. గమనించండి.

## వాటర్ సంప్

పూర్వ కాలము చాలా భాగము ఇండ్లకు బావులు ఉండేవి. ఇప్పటి తరం వారికి బావులు అంటే ఏమిటి అని ఆలోచన వస్తూండవచ్చు. మీ అమ్మమ్మ గారి ఇళ్ళ యందు మరియు మీ ఇల్లు పూర్వముదైతే మీ ఇంటియందు బావి ఉండవచ్చు. లేదా మీ పెద్దలని అడిగితే మా ఇంటికి బావి ఉండేదని వారే చెబుతారు. కాలం మారింది. ఇప్పుడు ఇంటికి ఓ మునిసిపల్ కొళాయి లభ్యమవుతున్నది. కావున బావులను త్రవ్వించుకొనే అవసరం తీరింది. ఈ కాలానికి మునిసిపల్ కొళాయిలు, బోర్లు ప్రతి ఇంటా గమనిస్తుంటాము.

అదే పూర్వ కాలము నీటికి కటకట. అనేక రకాల ఇబ్బందులు పడేవారు. ఎంతో దూరము నుండి నీటిని మోసుకొని వచ్చేవారు. అప్పుడు ఊరంతటికీ కలిపి ఒకటి రెండు బావులు ఉండేవి. ఉన్న బావులకు మంచినీళ్ళ బావి, ఉప్పునీళ్ళ బావి అని పేరు పెట్టుకొనేవారు. తాగునీరు కోసం కాలువల గట్టుకు, చెఱువులకు, కుంటల దగ్గరకు, ఊటల దగ్గరకు, కొలనుల దగ్గరకు, ఊరి మధ్యనున్న బావుల దగ్గరకు వెళ్ళి నీటిని తోడుకొని, భుజాలపై లేదా చంకలో ఉంచుకొని ఇంటికి వెళ్ళేవారు. త్రాగునీటిని కంచు, ఇత్తడి, రాగి బిందెలయందు నిలువ ఉంచుకొనేవారు. కంచు, ఇత్తడి, రాగి బిందెలలో నీటిని నిలువ ఉంచుకున్నచో అనేక రకాలైన బ్యాక్టీరియాలు నశిస్తాయి. ఈ విషయాన్ని మన పూర్వీకలు ఓ కాలంలోనే కనుక్కొని పాటిస్తున్నారు. అనాది కాలంనుండే ఈ పద్ధతి మన భారతదేశం నందు నడుస్తున్నది. ఈ సంవత్సరములో అనగా 2005వ సం॥లో శాస్త్రజ్ఞులు కంచు, ఇత్తడి, రాగి బిందెలపై విస్తృత పరిశోధనలు చేసి కంచు, ఇత్తడి, రాగి బిందెలయందు నీటిని నిలువ ఉంచుకున్నచో బ్యాక్టీరియా నశిస్తుందని నొక్కి వాక్కాణించారు. మన పూర్వీకులు ఎప్పుడో ఎన్నో వేల సంవత్సారాల క్రితమే ఈ విషయాన్ని కనుగొన్నారు.

ఇప్పటి కాలములో కంచు, ఇత్తడి, రాగి బిందెలు మాయమై వాటి స్థానములో ప్లాస్టికు మరియు స్టీలు బిందెలు ప్రత్యక్షమైనాయి. ఆనాడు నీటిని చేదుకొని మోసుకొని ఇంటికి తెచ్చుకొనేవారు. అందుకే ఆరోగ్యంగా, ఏ రోగములు లేకుండా, ఏ అలర్జీలు లేకుండా ఆనందంగా, కులాసాగా ఉండేవారు. తిన్నది అరిగేది. మరి ఇప్పుడు మోటరు స్విచ్ వేస్తే మేడపైన ట్యాంకులో నీళ్ళు పడతాయి, క్రింద కొళాయి తిప్పుకుంటే నీరు వస్తుంది. కొందరు అయ్యావార్లకు ఈ మోటరు స్విచ్ వేయడం కూడా పయ్యాకమై, ఒళ్ళు బరువుగా, మజ్జుగా ఉంటారు. మోటరు స్విచ్ వేయడానికి కూడా బద్ధకమే. తిన్నది అరగదు. దీనివల్ల స్థూలకాయము. అనారోగ్యము, ముఖ్యంగా అలర్జీలు.

మన సుఖాలు ఎంతలా పెరుగుతున్నాయి అంటే, బావులు పోయె, కుళాయిలు వచ్చె, కుళాయి నుండి నీరు పట్టుకోవడానికి కూడా యాకమాయె, మోటార్లు వచ్చె, ఈ మోటారు వేసుకొనేందుకు బద్ధకమాయె, ఇటువంటి వారి కోసమే శాస్త్రజ్ఞులు ఇంకా నూతనమైన విధానమును కనుగొన్నారు. అది ఏమంటే మేడపైన నీటి ట్యాంకుయందు ఓ నీటి బుడగ లాంటి ప్లాస్టిక్ బాలును కరెంటు వైర్లతో కలిపి బిగిస్తారు. తద్వారా ట్యాంకు యందు నీరు అయిపోవడమాలస్యం ఆటోమాటిక్‌గా క్రింద నీళ్ళ మోటర్ ఆన్ అయ్యి పైన నీళ్ళ ట్యాంకు యందు నీటిని పంపుతుంది. ట్యాంకు నిండడం ఆలస్యం ఈ ప్లాస్టిక్ బాలు పైకి తేలి మోటరు స్విచ్‌ను ఆపుతుంది. దీని ద్వారా నీళ్ళకొరకు మోటరు స్విచ్ వేసుకొనే అవసరం కూడా లేదు. అంతా ఆటోమాటిక్. పూర్వం మనిషికి ఒక తోక ఉండేది. దాని వాడుక అవసరం లేక తోక మాయమై ఉన్న రెండు కాళ్ళు, రెండు చేతులు మిగిలాయి. ఇలాగే మోటరు స్విచ్ వేసుకొనే అవసరం కూడా లేకుండా కొత్త పద్ధతులు కనుగొంటూ ఉంటే కాలం మారేకొద్దీ కాళ్ళు కూడా మాయమైతాయేమో. ఎవరికేం తెలుసు జరిగినా జరగొచ్చేమో.

మీరు బావులు వేసుకుంటారో వేసుకోరో అయినా వాస్తురీత్యా బావుల స్థలములను గురించి తెలుసుకుందాము. మొత్తము స్థలముయందు ఈశాన్య భాగమునకు బావి రావడము మహాశ్రేష్ఠము. అదే తూర్పు ఈశాన్యమునకు, ఉత్తర ఈశాన్యమునకు బావి రావడము శ్రేష్ఠము. తరువాత తూర్పు భాగము మరియు ఉత్తర భాగము బావి నిర్మాణము మంచిదే. ఇక మిగిలిన ప్రాంతాలయందు బావులను వేసుకోవడం వద్దు.

అట్లు కాదని మిగిలిన ప్రాంతాలలో బావులు వేసుకుంటే మీ స్థలవాస్తు ఊరకుండా మిమ్ములను అనేకరీతులా బాధలకు గురిచేస్తూ ఆపసోపాలు పడేలా చేసి అందరి మధ్యా మీకున్న గౌరవాన్ని రోజురోజుకూ ఒక్కొక్కమెట్టు చొప్పున క్రిందకు దించుతుంది.

ఒకవేళ నైఋతిలో బావి వేసుకుంటే ఇక కష్టాలు అనుభవించే పనిలేక టికెట్టు ఖర్చు లేకుండా ఏకంగా పైకి తీసుకువెళుతుంది.




## హెచ్చు, తగ్గులు

మన గృహము బయట గల హెచ్చుతగ్గులు అనగా మిర్రు, పల్లములు కూడా మన గృహముపై ప్రభావము చూపించును. పరిసర వాస్తులో ఇది కూడా ఒక భాగమే. ఉదాహరణకు గృహము బయట నైఋతిలో గుట్ట లేదా కొండ, గృహము బయట ఈశాన్యములో బావి లేదా కొలను.

ఈ ఇంటి బయట మిర్రు పల్లములు గృహముపై ప్రభావమును చూపడము అరుదు అని కొందరు శాస్త్రజ్ఞుల ఆలోచన అయితే ఇక్కడొక విషయం మనం గమనించాల్సి ఉంటుంది. గృహము వాస్తురీత్యా నిర్మాణము చేసుకొని ఉంటే ఈ ఇంటి బయటి హెచ్చు తగ్గుల చెడుప్రభావము తగ్గే అవకాశము ఎక్కువ. ఉదాహ రణకు : వాస్తురీత్యా నిర్మాణమైన గృహమునకు తూర్పు భాగములో చిన్న పాటి గుట్ట ఉండడము, దీని ప్రభావము అసలుకు చూపించలేకపోవడము, లేదా చాలా ఏళ్ళ తరువాత ప్రభావము చూపించడము, ఒకవేళ ప్రభావము చూపిననూ చాలా కొద్దిపాటిగా ఉండడం.

ఒకవేళ గృహము వాస్తురీత్యా నిర్మించుకోకుండా ఉంటే ఇంటి బయటి హెచ్చుతగ్గుల చెడు ప్రభావము బలము పెరిగి వాటి ఫలితాలు గృహస్థులు అనుభవించాల్సి ఉంటుంది. ఉదాహరణకు : వాస్తురీత్యా నిర్మించుకోని గృహము నకు దక్షిణ భాగములో పల్లము ఉంటే విపరీతమైన ధననష్టము, ఇంట ఆడవారి గోల, కీడు, వ్యాపార పతనము, అభద్రతా భావము, అనారోగ్యము.

సందర్శించండి.

**www.subhavaastu.com**

ప్రపంచంలోనే

పూర్తీగా వాస్తు వివరాలను, ప్లానులను, వివిధ

భాషలలో వివరంగా విషయాన్ని

అందించే

అతిపెద్ద వాస్తు వెబ్‌సైట్

ధన్యవాదములు :-

సురేష్.,

**subhavaastu@gmail.com**